క్లుప్తంగా

పాఠ్యాంశాలపై అవగాహన అవసరం

నిండ్ర: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకుని చక్కగా చదవాలని ఎంఈఓ శ్రీధర్ రాజు అన్నారు. గురువారం మండలంలోని కావునూరు, అరూరు పాఠశాలలో ఆయన పరిశీలించారు. బోధనాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు వివరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధనాంశాలపై సులభ పద్ధతిలో పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న శ్రీసత్యసాయిబాబా సంస్థ ప్రతినిధులు

శ్రీరంగరాజపురం: శ్రీసత్యసాయిబాబా జయంతి సందర్భంగా మండలంలోని 48 బసివిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాత కృష్ణయ్య సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శ్రీసత్యసాయిబాబా సేవా సంస్థ అధ్యక్షుడు మధుసూదనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబా అడుగుజాడలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా దాతల సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్లు, ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఢిల్లయ్య, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, ఎంపీటీసీ కోటిరెడ్డిబాబు, నాయకులు చంద్రశేఖర్, శివప్రకాష్, బాల వికాస్, గజేంద్ర, పాండురంగడు, శేషు నాయుడు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నిండ్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన వాహనదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ఉంచుకోవడం, వాహనాలు అధిక స్పీడ్‌తో ప్రయాణించడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్య సాయిబాబాకు భజన పూజలు



జీడీ నెల్లూరులో సత్య సాయిబాబా చిత్రపటం, పాదుకల ఊరేగింపు

గంగాధరనెల్లూరు: భగవాన్ శ్రీపుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలో భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన విజయసారధి గృహంలో చిత్తూరు జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు మధుసూదనం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీపుట్టపర్తి సత్యసాయిబాబా ప్రత్యేక భజనలు, పాదుకల పూజ రుద్ర పారాయణం, పల్లకిలో పాదుకల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం హమీద్‌బాషా



హమీద్ బాషాను సన్మానిస్తున్న హెచ్‌ఎం నరేంద్రకుమార్, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ఉపాధ్యాయ వృత్తిలో ఢంకా హమీద్‌బాషా ఆదర్శప్రాయుడని టీకేఎం పేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.నరేంద్రకుమార్ అన్నారు. గురువారం టీకేఎం పేట పాఠశాలలో హమీద్‌బాషా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎస్టీయూ యూనియన్ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యలపై అంకిత భావంతో పోరాటం చేశారని గుర్తు చేశారు. హమీద్‌బాషాను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

జాతీయస్థాయి పరీక్షలో రమణ ప్రతిభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నెట్‌వర్క్ ఎఫ్‌పీ నిర్వహించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన క్వాలిఫైడ్ పర్సనల్ ఫినాన్స్ ప్రొఫెషనల్‌లో ఏఎంఎఫ్ఐ రిజిస్టర్ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ రమణ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ముంబైలో జరిగిన స్నాతకోత్సవంలో ఆర్థిక సేవల పరిశ్రమ అనుభవజ్ఞులు అమిత్ త్రివేది ధ్రువీకరణ పత్రం అందజేశారు.

బ్రహ్మోత్సవ సంబరం

- నేడు ధ్వజారోహణంతో ప్రారంభం
- దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద రథం కలిగిన ఆలయం
- అర్జున తపస్సు, రథోత్సవం, అగ్నిగుండం ప్రధాన ఘట్టాలు
- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తుల రాక





అర్జున తపస్సుమాను వద్ద వరపడిన మహిళా భక్తులు (ఫైల్), భక్తజన సందోహంతో మహారథోత్సవం (ఫైల్), (ఇన్‌సెట్) ద్రౌపదీదేవి అమ్మవారు

పుత్తూరు శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడి బ్రహ్మోత్సవాలు మహాభారతానికి ఆనవాలుగా నిలుస్తున్నాయి. ఏటా జరిగే ధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాలే పుత్తూరు తిరునాళ్లుగా ప్రసిద్ధికెక్కాయి. దక్షిణ భారత దేశంలోని ధర్మరాజుల స్వామి ఆలయాల్లో ఎక్కడా లేనివిధంగా 45 అడుగుల చుట్టు కొలత, 40 అడుగుల ఎత్తు కలిగిన భారీరథం ఇక్కడి ప్రత్యేకం. 10 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అర్జున తపస్సు, మహారథోత్సవం, అగ్నిగుండ ప్రవేశం తలమానికంగా నిలుస్తాయి. శుక్రవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శతాబ్దాలుగా ఇక్కడ జరుగుతున్న అగ్నిగుండ ప్రవేశం అమ్మవారి సత్యశీలతకు నిలువెత్తు నిదర్శనంగా భక్తులు విశ్వసిస్తారు.

–పుత్తూరు

పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోనే పుత్తూరు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నెల 8న వరలక్ష్మీవ్రతం రోజున అర్జున తపస్సు జరుగనుంది. అదేరోజు సాయంత్రం ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బందితో అమ్మవారి ఊరేగింపును పురస్కరించుకొని పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. అనంతరం పాటకచేరీ, రాత్రి 11 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 9న మహారథోత్సవం జరుగనుంది. కౌరవుల వధ అనంతరం పాండవులు విజయోత్సవంతో రథాన్ని అధిరోహించి పురవీధుల్లో ఊరేగడమే రథోత్సవ ఘట్టం. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొనడం అత్యంత విశేషం. ఈ నెల 10న అగ్నిగుండ ప్రవేశ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కోరిన కోర్కెలను తీర్చిన అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకొంటారు.

ఆలయ ప్రాశస్త్యం

లభించిన ఆధారాల మేరకు విజయనగర సామ్రాజ్యం 17వ శతాబ్దంలో పతనం కావడంతో దక్షిణ భారతదేశంలో ఔరంగజేబు సైన్యం విజృంభించింది. వీరికి ఆర్కాడు నవాబు సైతం తోడుకావడంతో తమిళనాడులోని చెంగల్పట్టు ప్రాంతానికి చెందిన వారు పుత్తూరుకు వలస వచ్చారు. అలా వలస వచ్చిన వారిలో ఏడుగురు అన్నదమ్ములు ఉన్నారు. వీరు పొట్టకూటి కోసం పుత్తూరు సమీపంలోని చౌటూరు గ్రామంలో ఓ బావిని తవ్వే పనికి పూనుకొన్నారు. బావి తవ్వకాల్లో వీరికి చెక్కతో చేయబడిన అమ్మవారి విగ్రహం దొరికింది. అన్నదమ్ములు అమ్మవారి బొమ్మకు పూజలు చేయడం ప్రారంభించారు. అన్నదమ్ముల్లో చిన్నవాడు అమ్మవారికి ఆలయం కట్టాలని సంకల్పించి, అమ్మబొమ్మను బుట్టలో పెట్టుకొని గ్రామాల్లో తిరుగుతూ, కత్తితో శరీరంపై బాదుకొంటూ విరాళాల సేకరణ చేపట్టాడు. విషయం తెలుసుకొన్న కార్వేటినగరాన్ని పాలిస్తున్న సాశ్వరాజు విరాళాలు సేకరిస్తున్న వ్యక్తి చేతికి మరోకత్తిని ఇచ్చి బాదుకోమని పరీక్షిస్తాడు. పరీక్షలో నెగ్గిన ఆ వ్యక్తిని ఏం కావాలో కోరుకోమంటాడు. దీంతో ఆ వ్యక్తి పుత్తూరులో అమ్మవారికి ఆలయం నిర్మించాల్సిందిగా కోరుతాడు. వైష్ణవ భక్తుడైన సాశ్వరాజు పుత్తూరులో ఆలయాన్ని నిర్మించారు. గ్రామస్తులు విరాళాలు పోగుచేసి 40 అడుగుల రథాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి పుత్తూరులో శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. భారతంలోని 18 పర్వాలకు అనుగుణంగా 18 రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

అర్జున తపస్సు

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకొనే వరలక్ష్మీవ్రతం శుక్రవారం నిర్వహించడం ఆనవాయితీ. అదేరోజు అర్జున వేషధారి అయిన వ్యక్తి తపస్సుమాను అధిరోహిస్తాడు. సాయంత్రం ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బంది అమ్మవారి ఊరేగింపును పురస్కరించుకొని పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. అనంతరం పాటకచేరీ నిర్వహించడం ఆనవాయితీ. అదేరోజు రాత్రి 11 గంటలకు అలుగు ఉత్సవం ఉంటుంది. పచ్చికుండ పైభాగంలో నాలుగు అడుగుల పొడవైన కత్తిని తలకిందులుగా నిలబెట్టి గ్రామంలో ఊరేగింపుగా తీసుకురావడాన్ని అలుగు ఉత్సవం అంటారు.

రథోత్సవం

కౌరవ వధ చేసిన పాండవులు విజయోత్సవంతో రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగడమే రథోత్సవ ఘట్టం. దక్షిణ భారతదేశంలోని ధర్మరాజుల స్వామి ఆలయాల్లో మరెక్కడా లేని విధంగా 45 అడుగుల చుట్టు కొలత, 40 అడుగుల ఎత్తు కలిగిన భారీ రథం పుత్తూరు ఆలయ ప్రత్యేకత. ఈ భారీ రథాన్ని పాండవులు అధిరోహించి ఆలయ మాడవీధులుగా పేర్కొనబడే బజారువీధి, నగరం రోడ్డు, కాపు వీధుల్లో ఊరేగుతారు. రథాన్ని కొన్ని వందల మంది గోవిందా.. గోవిందా అంటూ భక్తిపారవశ్యంతో లాగుతారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లడం ద్వారా తమ కోర్కెలు తీరుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం.



అగ్నిగుండ ప్రవేశం (ఫైల్)

అగ్నిగుండ ప్రవేశం

కోరిన కోర్కెలు తీర్చిన అమ్మవారికి తమ మొక్కుగా వేలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేయడం బ్రహ్మోత్సవాలకే తలమానికంగా నిలుస్తోంది. ఐదు శతాబ్దాలుగా జరుగుతున్న అగ్నిగుండ ప్రవేశం అమ్మవారి సత్యశీలతకు నిలువెత్తు నిదర్శనంగా భక్తులు విశ్వసిస్తారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కోసం ప్రత్యేక పూజలు



మిథున్‌రెడ్డి కోసం పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం కుట్రలతో పెట్టిన అక్రమ కేసుల నుంచి రాజంపేట ఎంపీ, వైఎస్ఆర్ సీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి త్వరగా బయటకు రావాలని జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి గురువారం సురుటుపల్లిలో వెలసి ఉన్న సర్వమంగళా సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం కృపాలక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల అనంతరం అక్రమ కేసులు పెట్టిన ప్రతి ఒక్కరికీ సీన్ రివర్స్ అవ్వడం ఖాయమన్నారు. అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారకుడదని, విధినిర్వహణలో నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. మిథున్‌రెడ్డికి స్వామి అభయం ఎప్పుడూ మెండుగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది కృపాలక్ష్మికి ఆశీర్వచనాలతో స్వామివారి ప్రసాదాలను అందించారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు

వెదురుకుప్పం: సంతబయలు మాజీ సర్పంచ్, వైఎస్ఆర్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల పెద్దిరెడ్డి తమ్ముడు చిన్నరెడ్డి మృతి చెందాడు. గురువారం కర్మక్రియలు జరిగింది. గ్రామంలో పర్యటించిన కుతూహలమ్మ తనయుడు, వైఎస్ఆర్ సీపీ నాయకుడు హరికృష్ణతోపాటు నాయకులు చిన్నరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి రామయ్య, జిల్లా ప్రచారకమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, నియోజకవర్గ నాయకుడు భీమ శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ధనుంజయరెడ్డి, మునిరత్నంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ లోకనాథ రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు దేవ రాజులురెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, రమేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటేశ్, జయప్రకాష్ ఉన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- యథేచ్ఛగా తమిళనాడుకు ఇసుక తరలింపు



క్షీరసముద్రం పెద్దకాలువలో ఇసుక తోడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ఉచిత ఇసుక టీడీపీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంటి నిర్మాణం పేరిట పగలు ఇసుక డంపింగ్, రాత్రి వేళల్లో తమిళనాడుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేలు నుంచి రూ.7 వేలు వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని క్షీరసముద్రంలో పెద్దవంకలో జేసీబీ సహాయంతో కొంత మంది తెలుగు తమ్ముళ్లు అక్కడక్కడా సుమారు 350 లోడ్లకు పైగా ఇసుకను డంపింగ్ చేశారు. దీంతో స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బుధవారం సాయంత్రం జేసీబీని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తహశీల్దార్ అందుబాటులో లేరు. దీంతో గురువారం తహశీల్దార్ లోకనాథపిళ్లై, సీనియర్ అసిస్టెంట్ కళావతి ఇతర సిబ్బందితో కలసి క్షీరసముద్రం పెద్ద కాలువతోపాటు గ్రామ పరిధిలో అక్కడక్కడా డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలించారు. తచ్చూరు–చిత్తూరు నూతన జాతీయ తహదారి జీఎంఆర్ పురం వంతెన కింద సుమారు 200 ఇసుక లోడ్లు ఇసుక డంపింగ్ చేసి అక్కడ నుంచి రాత్రి వేళల్లో తమిళనాడుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని తహశీల్దార్ సీజ్ చేశారు. వంతెన కింద ఎవరు డంపు చేశారో విచారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళల్లో పోలీసుల సహాయంతో నిఘా పెంచుతామన్నారు.

పుదుపేట ఉపాధ్యాయినికి ప్రశంసా పత్రం



ప్రశంసా పత్రం అందుకుంటున్న సురేఖ

నగరి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 29 వరకూ హైదరాబాద్‌లో జరిగిన 'సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్' శిక్షణలో చూపిన ప్రతిభకు పుదుపేట జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయిని సురేఖ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు గురువారం ఆమెను అభినందించారు. సైద్ధాంతిక, ఆచరణాత్మక భాగాలు, విద్యా పర్యటనలు, బోధనా సహాయాల సృష్టి అనే అంశంపై ప్రాజెక్ట్ తయారుచేసినట్లు సురేఖ తెలిపారు. ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ రాహుల్‌కుమార్ ప్రశంసా పత్రంతో పాటు పాఠశాల విద్యాకిట్‌ను కూడా అందించారన్నారు.

పిల్లలందరికీ ఆధార్ ఎన్‌రోల్ చేయాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల

వెదురుకుప్పం: పిల్లందరికీ ఆధార్‌లో ఎన్‌రోల్ చేయించాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. గురువారం వెదురుకుప్పంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలతో ఇప్పటికీ ఆధార్‌కార్డులో నమోదు చేసుకునే తల్లిదండ్రులతో చేయించాలన్నారు. వంద శాతం నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ గాయత్రి, గ్రామ మహిళా కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు సీఐగా శేఖర్‌రెడ్డి



పుత్తూరు: అర్బన్ సీఐగా కె.ఆర్.శేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జోన్‌లో సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ సురేంద్రనాయుడు ఇటీవలే వీఆర్‌కు బదిలీ అయ్యారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు



పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కళాశాలలో ఆధునిక ల్యాబ్ సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వర్చువల్ తరగతి గదుల సదుపాయాలు ఉన్నాయన్నారు. డాక్టరేట్ విద్యార్హతలున్న అధ్యాపకులతో విద్యాబోధనలు కళాశాల ప్రత్యేకత అని వెల్లడించారు. డిగ్రీలో చేరదల్చిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94417 75347, 83745 56441 నెంబర్లలో సంప్రదించాలన్నారు.


విద్యార్థులకు అనుగుణంగా బస్సు నడపాలి



సమయానికి బస్సు రాకపోవడంతో ఎదురు చూస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: విద్యార్థులకు అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని డీఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గురువారం పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేకపోవడంతో పిల్లలు ఆలస్యంగా ఇంటికి చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి పడిపోయిన తర్వాత బస్సు నడుపుతుండడడంతో భయాందోళన రోజు రోజుకి పెరిగి పోతోందన్నారు. విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు సక్రమంగా నడిచేలా చూడాలని అన్నారు. 5 గంటలైనా బస్సు రాకపోవడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్ర వాహనాల్లో తీసుకెళ్తున్నారని తెలిపారు. గురువారం కూడా బస్సు రాకపోవడంతో విద్యార్థులు పొద్దు పోయేంతవరకు బిక్కుబిక్కుమంటూ పాఠశాల ఆవరణలో ఉండిపోయారు. వీరికి పాఠశాల వాచ్‌మెన్ తోడుగా నిలిచారు.

బాధిస్తున్న కాలుష్యం



పగలే లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారుడు



దుమ్ముతో నిండిపోయిన తూగుండ్రం రోడ్డు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని తూగుండ్రం రోడ్డులో ప్రయాణించాలంటే జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీపీ కంపెనీ భారీ యంత్రాల రోజువారీ ప్రయాణాలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గంగాధరనెల్లూరు నుండి వేపంజేరికి ప్రయాణించాలంటే దాదాపు మూడు కిలోమీటర్ల ప్రయాణానికి గంట సమయం పడుతోంది. ఈ గుంతల రోడ్డులో భారీ వాహనాలు, బస్సులు ప్రయాణిస్తే దుమ్ము నిండిపోయి ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టతరంగా అవుతోంది. జీడీ నెల్లూరులోని దుకాణలలో కూడా లో దుమ్ము నిండుకు పోతుందని యజమానులు ఆరోపిస్తున్నారు.

కామధేనువుపై విహరించిన శ్రీకృష్ణుడు

- అమ్మగారి ఇంటికి వెళ్లిన ద్రౌపదీదేవి
- సారె సమర్పించిన చౌటూరు గ్రామస్తులు



కామధేనువుపై విహరిస్తున్న శ్రీకృష్ణ స్వామివారు



ద్రౌపదీదేవి ఊరేగింపు

పుత్తూరు: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పండరి భజనలు, కోలాటాలతో పాటు బాణసంచా పేలుళ్ల నడుమ పాండవులు ముందు కదలి వెళ్తుండగా శ్రీరుక్మిణీ సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు కామధేనువుపై పట్టణ పురవీధుల్లో విహరిస్తూ రావడం కన్నుల పండుగగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అంతకు ముందు ఉదయం 6 గంటలకు ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివార్లకు ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు. పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా పయనమై వెళ్లారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని భక్తిప్రపత్తులతో పూజించి, సారెను సమర్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. చౌటూరు నుంచి సాయంత్రం సారెతో ఊరేగింపుగా బయల్దేరిన అమ్మవారు రాత్రికి ఆలయానికి చేరుకొన్నారు. ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.